
“అయితే ఏవంటావు?” అన్నాడు రామం విసుగ్గా మొహం పెట్టి.

“మీకు మరోసారి చెప్తున్నాను. నాతో మీరు పంచుకోవాల్సిన సమయాన్ని మీ ఫ్రెండ్స్ కాజేయడం నేనెంతమాత్రమూ సహించను” అంది సరోజ భర్త వైపు చూస్తూ.

“నీతో నా అనుబంధం ప్రారంభమై మూడేళ్ళయినా కాలేదు. కానీ వాళ్ళు నాకు జ్ఞానమొచ్చినప్పట్నుంచీ నన్నంటే వున్నారు. నన్ను కష్టాల్లో ఆదుకున్నారు. నా సుఖసంతోషాల్లో పాలుపంచుకున్నారు. అలా అని నిన్నెప్పుడూ నేను చులకన చేయలేదు. నిన్ను నిర్లక్ష్యం చేసినట్టు నువ్వు భావిస్తున్నావంటే అది పూర్తిగా నీ ఆలోచనా సరళిలోని లోపం. అందుకు నేనేమీ చేయలేను” భుజాలెగరేస్తూ అన్నాడు రామం.




# మార్పు

'సీలకెసల్క'

"చెయ్యలేరండీ! మీరెందుకు చేస్తారూ? నన్ను పెళ్ళిచేసుకోకముందు, 'నువ్వే నా ప్రాణం' అన్నారు. 'నా జీవితమంతా నీతోనే' అన్నారు. కానీ ఇప్పుడు మీకు నా మీద మోజు తీరిపోయింది. మీ కళ్ళకొక శత్రువులా కనిపిస్తున్నాను. అయినా మీరంటే ఇష్టం చావలేదు నాకు. కానీ మీకు మాత్రం మీ ఫ్రెండ్స్ తర్వాతే నేను. వాళ్ళ ముందు నేనో గడ్డిపోచతో సమానం మీకు" అంది సరోజ రోషంగా.

"చూడు సరూ, నా స్నేహితులు పూర్తిగా నాకు సంబంధించిన వాళ్ళు. సంవత్సరానికి ఏ రెండు మూడు సార్లో వస్తారు దూరం నుంచి. ఈ ఊళ్ళో అటువంటి స్నేహితులు నాకెలామూ లేరు. నాతో కొంచెం సమయం గడపాలని ఎంతో దూరం నుంచి వచ్చిన వాళ్ళతో, 'నేను బిజీగా వున్నాను. నా ఇంటి పనులు నాకున్నాయి. నా పెళ్ళాం ఎదురుగా కూర్చుని కబుర్లు చెప్పి ఆవిణ్ణి సంతోషపెట్టాలి. మీతో గడిపేందుకు నాకు తీరిక లేదు' అని ఎలా చెప్పగలననుకుంటున్నావు? వాళ్ళుండేది మహా అయితే నాలుగు రోజులు. ఆ తరువాత వాళ్ళ సంసారాలు, ఉద్యోగాలతో వాళ్ళకూ తీరిక వుండదు. కనీసం ఆ నాలుగు రోజులైనా వాళ్ళను సంతోషపెట్టకపోతే నేనేం స్నేహితుణ్ణి?"

"ఏం? స్నేహితులు మీ కొక్కరికే వున్నారా? ఇంకెవరూ స్నేహం చేయడం లేదా? వాళ్ళొస్తే మీ కసలు ప్రపంచమే గుర్తుండదు. భోజనం, నిద్ర ఏవీ గుర్తురావు మీకు. ఏ సమయానికి ఎక్కడుంటారో తెలియదు.

మీకు తెలుసు, మిమ్మల్ని చూడకుండా నేనొక్క రోజు కూడా వుండలేనని. తొలి కాన్పు ఎవరికైనా పుట్టింట్లో జరుగుతుంది. అయినా నేను లేకపోతే మీ కిబ్బందని, మా ఇంటికి వెళ్ళకుండా, మా వాళ్ళు ఎంత చెప్పినా వినకుండా, వాళ్ళనే ఇక్కడకు రప్పించి, అనుక్షణమూ మీ చుట్టూ తిరిగి, రెక్కలు విరగ్గొట్టుకుని, నేను పడిన బాధ మీ స్నేహితుల్ని చూసినపుడు కనీసం లీలగానైనా గుర్తుకు రాదా మీకు?" ఆవేశంగా అంది సరోజ.

"నీ కిష్టమైన పని నువ్వు చేశావు. నా కోసం చేశానని నువ్వనుకోవడంలో నా భాగం ఎంతవరకో నా కర్థంకావడం లేదు."

"ఇంత మొండిగా తయారయ్యారేం?"

"అవును. నీలో మొండితనమే కన్పిస్తోంది నాకు."

"సర్లెండి. ఈ గొడవ ఇప్పట్లో తేలేది కాదుగానీ బాబుకు పండక్కి బట్టలు కొనాలి. రేపు సాయంత్రం వెడదాం. ఆఫీస్ నుంచి త్వరగా వచ్చేయండి."

"నేనూ రావాలా?"

"మీరు కాకపోతే పక్కింటి సుబ్బారావుతో వెళ్ళి కొనితెచ్చుకోమంటారా?"

"నా కభ్యంతరం లేదు."

"మీకుండదని తెలుస్తూనే వుంది. సుబ్బారావుకూ వుండకపోవచ్చు. కానీ సుబ్బారావు భార్యకూ, ఇంకా వీధిలోని వాళ్ళకూ వుండే అవకాశముంది."

"నీ కిష్టమైనపుడు వేరే వాళ్ళ గురించి పట్టించుకోవాల్సిన అవసరమేముంది?"

"నా కిష్టమని నేనన్నానా?"

"మరి నేనన్నానంటావా?"

"అబ్బా... ఇంత వితండ వాదనేవిటండీ? అయితే రానన్న మాటేగా!"

"... ... ..."

"అవున్లెండి. నేను వద్దన్నా మీరు బలవంతంచేసి లాక్కెళ్ళిన రోజులు మర్చిపోయారు పూర్తిగా. పరాయి వ్యక్తితో ప్రవర్తించినట్టే వుంటున్నారీ మధ్య. మీ ధోరణి నాకేమీ అంతుబట్టడం లేదు. వెళ్తానండి. అన్నిటికీ నేనే వెళ్తాను. మీరూరికే భోజనానికీ, నిద్రకూ ఇంటికొచ్చి మిగిలిన సమయం దేశం మీద బ్రతకండి. ఇప్పుడే ఇలా వున్న మీరు ముమ్ముందు ఇంకేమైనా చేయగలరు. నా బ్రతుక్కేదో ఉపద్రవమొచ్చిపడింది. ఇహ నేనీ ఇంట్లో వుండలేను. రేపే పోతున్నాను. అప్పుడుగానీ నా విలువ మీకు తెలిసిరాదు. .......

***

"డియర్ మూర్తీ,

మాటలతో ఎవరూ ఎవర్నీ మార్చలేరు. కానీ చేతలతో అవతలివారిలో తాత్కాలికంగానైనా మనక్కావల్సిన మార్పు వచ్చేలా చేసుకోవచ్చు కొంతవరకూ. తనకివ్వాల్సిన విలువ ఇస్తున్నాను. తననెప్పుడూ చులకన చేయలేదు. అఫ్‌కోర్స్, ఈ విషయంలో సరోజ ప్రేమను శంకించేందుకు లేదు. తను నన్నెంతగానో ప్రేమిస్తుంది. ఇది తిరుగులేని నిజం.

కానీ తన ప్రేమ అను, వ్యామోహం అను, అది మోతాదు మించింది. ప్రేమను వ్యక్తం చేసేందుకు సమయం, సందర్భం వుంటాయి. తన దృష్టిలో మేమిద్దరం పరస్పరం బందీలం. మూడో వ్యక్తి జోక్యం తను సహించలేదు.

స్త్రీ సాంఘిక పరమైన సంబంధాలు లేకుండా రోజులు గడిపేయవచ్చేమోగానీ మగవాడికి సమాజంతో సంబంధం లేకుండా ఒక్క రోజు కూడా గడవడం కష్టం. ఒకవేళ తప్పనిసరై అలా ఒక రోజు లేదా కొన్ని రోజులు గడిచినా, దాని ప్రభావం మగాడి జీవితం మీద తప్పకుండా పడుతుంది. కాదంటావా?

ఇవన్నీ తన కర్థంకావు. నా అనుభవాన్ని బట్టి, తనకు నేను మాటలతో నచ్చచెప్పలేను. అదే విషయం పదేపదే చెప్పడం వలన తన వాదన, పంతం పెరుగుతాయే తప్ప ఏ మాత్రమూ తగ్గే అవకాశం లేదు.

అందుకే తను బాధపడినా సరే ఆదేవిటో చేతల్లోనే చూపిస్తాను. తమ మాటలగ్గానీ, చేతలగ్గానీ ఫలితాలు వ్యతిరేకంగా వున్నప్పుడే మనుషులు మరో విధంగా తమకు సుఖంగా వుండే రీతిలో ఆలోచించడం ప్రారంభిస్తారు. సరోజలో నేనాశించిన మార్పు త్వరలోనే వస్తుందని భావిస్తున్నాను.

నీ రామం"

***

ఆఫీస్ నుంచి ఇంటికి వస్తూనే గుమ్మం మెట్ల మీద కూర్చున్న వ్యక్తుల్ని చూసిన రామానికి ఆశ్చర్యం కలగలేదు.

సరోజ పుట్టింటికి వెళ్ళి అప్పటికి వారం కావస్తోంది. పుట్టింటి కెన్నడూ ఒంటరిగా రాని కూతురు, ఆ రోజు ఓ చంకలో పిల్లాడితోనూ, మరో చేత్తో సూట్‌కేస్‌తోనూ దిగడంతో ఆశ్చర్యపోయారామె తల్లిదండ్రులు. సరోజ కూడా అందరాడవాళ్ళలానే పైకి తేలలేదు మొదట్లో. నెమ్మదిగా విషయం రాబట్టగలిగారు వాళ్ళిద్దరూ.

అల్లుడి మీద అలిగి కూతురు పుట్టింటికొచ్చిందన్న విషయం తెలిశాక, వాళ్ళిద్దరికీ మనసు మనసులో లేదు. వెంటనే ఆఘమేఘాల మీద బయలుదేరి అల్లుడి దగ్గరకు వచ్చారు.

అల్లుణ్ణి చూడగానే నవ్వు మొహంతో పలకరించాడు సోమసుందరం. "రావయ్యా బాబూ, నీ కోసం ఈ మెట్ల మీద కూచుని నడుం నొప్పెట్టింది."

"అరెరే..." అని నొచ్చుకుంటూనే మావగార్నీ, అత్తగారినీ చిరునవ్వుతో పలకరించి, తాళం తీశాడు రామం.

రామం అత్తగారు వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి తీసుకొచ్చింది. భార్య అందించిన కప్పు అందుకుంటూ, అల్లుణ్ణి ఓరగా చూస్తూ, "ఈ మధ్య ఆఫీస్‌లో పనెక్కువగా వుంటోందేవిటోయ్?" అన్నాడు సోమసుందరం.

మావగారి ప్రశ్న వెంటనే అర్థంకాక, " 'లేదే!' అనబోయి తరువాత అందులోని గూఢార్థం అవగతమై, "అవును సుమా! మీ కెలా తెలిసిందీ?" అన్నాడు రామం ఆశ్చర్యాన్నభినయిస్తూ.

"అవునట కదూ? అమ్మాయి చెప్పిందిలే. హి...హి... నీ కిష్టమని సున్నుండలు చేసి పంపిందోయ్ మీ ఆవిడ. ఏవోయ్ ఇలా తీసుకొస్తావూ?" అంటూ భార్యను పిలిచాడు సోమసుందరం.

"ఇప్పుడెందుకులెండి" అన్నాడు రామం మొహమాటపడుతూ.

"అదేవిటయ్యా, ఎప్పుడూ ఎంతో ఇష్టంగా తినేవాడివి, వద్దంటున్నావేమిటి? ఆరోగ్యమేమైనా తేడా చేసిందా?"

గతుక్కుమన్నాడు రామం. తన

"మన ఇంటిని స్వర్గంగా మార్చేస్తాను చూడు" కొత్తగా తెచ్చిన సోఫా కం బెడ్‌ను పెళ్ళానికి చూపుతూ అన్నాడు **మహేష్.**

"వద్దండీ! ఆ తరువాత రంభ, ఊర్వశి, తిలోత్తమలను తెస్తానంటారు!" — బద్దిగం

● స్వర్గం



మానసికారోగ్యం సరిలేక భార్యను పుట్టింటికి పంపించాడేమోననే భావన మావగారి మాటల్లో ధ్వనించిందతడికి.

"అబ్బే అదేం లేదండీ! సరోజకు వంట్లో బావుండలేదంటే నేనే మీ దగ్గరకు పంపించాను. ఎలా వుంది వ్వడు తనకు? నాకు ఖాళీ లేక నేను రావడం పడలేదు. మీ మనవడు బాగున్నాడా?" మొహంలో ఎటువంటి భావమూ వ్యక్తంకాకుండా జాగ్రత్తప డుతూ అన్నాడు రామం.

'మా బాగా దెబ్బకొట్టావోయ్' అను కున్నాడు సోమసుందరం మనసులో.

"తనకేం? లక్షణంగా వుంది. పాపం నీ గురించే ఆదుర్దాపడుతోంది. ఈ మధ్య పనెక్కువై ఇంటిపట్టున సరిగా ఉంటున్నట్టు లేదు నువ్వు. ఆరోగ్యం ముఖ్యం నాయనా, కాస్త ఇంటిపట్టున వుండి విశ్రాంతి తీసుకుంటూండు. మేం వెళ్ళగానే సరోజను పంపిస్తాం. తనేదో తెలియక మాట్లాడినా నువ్వు సర్దుకుపోవాలి!

అయినా, ఈ ఆడాళ్ళింతేనయ్యా, మీ అత్తగారు మాత్రం... నేనెంత కష్టపడ్డాననుకున్నావ్, ఈవిణ్ణి సెటిల్ చేసేందుకు?"

అత్తగారి మొహంలోకి చూశాడు రామం. ఆవిడ భర్తవైపు గుర్రుగా చూస్తోంది. ఎంతో డిప్లమేటిగ్గా మాట్లా డ్తోన్న మావగారితో ఇంకేం మాట్లాడాలో తోచలేదతడికి.

మర్నాడే బాబు నెత్తుకుని వచ్చింది సరోజ. ఆ రాత్రి భర్తతో అందామె, "ఏమండీ మీ ఫ్రెండ్స్‌కు రమ్మని ఉత్తరం రాయండీ! మీరూ చూసి చాలా కాలమైందిగా! అంతా సరదాగా గడ పొచ్చు వాళ్ళోజులు. ఈసారి మీరిం ట్లోంచి బయటకు వెళ్ళనక్కర్లేదు. మీకేం కావాల్సినా నన్నడగండి. ఎదు రుతిరిగితే నా చెంపలు వాయించండి. ఇన్నాళ్ళూ మీ స్నేహితుల్ని పరాయి వాళ్ళుగా భావించినందుకెంతో సిగ్గుప డుతున్నాను."

భార్య వైపు ఆశ్చర్యంగా చూశాడు రామం. మావగారు కూతురికి మంచి మందే వేశాడనిపించిందతడికి. ఆ రాత్రి భార్యాభర్తల్లో ఏ ఒక్కరూ నిద్రపోలేదు.

***

నాలుగు సంవత్సరాల తర్వాత మిత్రుడి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని విప్పాడు మూర్తి.

"డియర్ మూర్తీ,

ఈ నాలుగేళ్ళలోనూ మనం సంవ త్సరానికి కనీసం నాలుగైదు సార్లు కలుసుకున్నాం. కలుసుకున్న ప్రతిసారీ వారం రోజులకు తక్కువ గడపలేదు మనం. నా భార్యలో మనం ఆశిం చిన మార్పు పూర్తిగా వచ్చింది. కానీ నాకే ఎందుకో మనం కలుసుకున్న ప్పుడల్లా తనను బాధపెడుతున్నానేమో అనిపిస్తోంది. నా భార్య నన్ను అన్నివి ధాలా సంతోషపెడుతున్నపుడు, నేనూ తనను సాధ్యమైనంత సంతోషపరచడం నా విధి అనిపిస్తోంది.

ఇది వరకు తను మిమ్మల్ని చిన్న చూపు చూసేది కనుక నేనూ మీతో కలిసి బయటకు వచ్చేవాణ్ణి. గతంలో మిమ్మల్ని చూస్తూనే నాకూ ఇంట్లో సుఖం లేకుండా చేసేది.

కానీ ఇప్పుడు మీరొచ్చినా నన్ను బాగానే ట్రీట్ చేస్తోంది. మీరొచ్చి నపుడు తన కిష్టమున్నా లేకపోయినా మీక్కావలసినవన్నీ అమర్చి తద్వారా నన్ను సంతోషపరిచేందుకు కష్టపడు తోంది. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తన కోణం నుంచి ఆలోచించినపుడు నాకు తట్టిన విషయాలివి.

మీరు నా స్నేహితులు. మీ పట్ల నా ప్రవర్తన ఎలా వున్నా మీరపార్థం చేసుకోరన్న నమ్మకం నాకుంది. కానీ నేను తప్ప తనకెవరూ లేరన్నంత పిచ్చిగా ఆరాధిస్తోంది నన్ను.

అటువంటి వ్యక్తిని, నాకు వీలున్నంత వరకూ కనీసం ఒక్క నిముషం కూడా బాధపెట్టకూడదనుకుంటున్నాను. ఇది వరకు భార్యా పిల్లలూ ఇదంతా జంఝాటం అనుకునేవాణ్ణి. కానీ ఈ మధ్య కాలంలో నేను తెలుసుకున్న విశేషమేమిటంటే, నేను నా భార్యా పిల్లల్ని మిమ్మల్నందరి కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. ఇలా అంటున్నానని మరోలా భావించవద్దు. నా స్నేహితుల కోసం కాలం వెచ్చించడమనేది- నా భార్యాపిల్లల తరువాతే!"

నీ రామం

కొద్ది రోజుల క్రితం తను మిత్రు డింటికి వెళ్ళినపుడు తన రాకకతడు బాధపడకపోయినా, పెద్దగా సంతోషిం చినట్టు కనబడకపోవడానికి కారణమే మిటో ఆ ఉత్తరం చదివాక అర్థమైం దతడికి.

తన ప్రవర్తన ద్వారా తన భార్యలో మార్పు తీసుకువస్తానని థియరీ చెప్పడం మిత్రుడి వంతూ, దాన్ని ప్రాక్టికల్‌గా చేసి చూపించడం అతడి భార్యవంతూ అయిందనిపించడంతోపాటు, 'మగవా డికి ఏ విధంగా చూసినా స్నేహితుడి కంటే భార్యే ఎక్కువ!' అని ఎవ్వరో, ఎక్కడో చదివిన వాక్యమూ గుర్తొచ్చిం దతడికి.

## దిష్టిబొమ్మ

—పెదవకవీంద్ర

నేడెంత సుదినం
ఎన్ని గంతులేస్తే తీరుతుందీ ఆనందం
నేనూ జ్ఞానినయ్యాను
ఈ నాల్గురోడ్ల కూడలి దగ్గర
నిలబడ్డం మొదలెట్టిన దగ్గర్నుండీ
నేనూ నిజాలు తెలుసుకుంటున్నాను
చేలల్లోని దిష్టిబొమ్మలకూ, తమకూ మధ్య
సరిహద్దెందుకులే అనుకున్న ప్రజని చూస్తున్నాను
ఈ జనం ఓ పెద్ద నిశ్శబ్దవనం
లేడిని పులి చీలుస్తోంటే
ప్రకృతి సహజమంటూ చప్పట్లు కొడతారు
మరి బలిసినోడు బక్కోణ్ణి బాదుతోంటే
నోళ్ళకు ఉక్కు సీళ్ళేసుకుని
నాల్గురోడ్ల మధ్య దిష్టిబొమ్మలవుతారు
ఈ ఖాకీలు బహు చక్కటి మూకీ చిత్రాలు
చట్టాన్ని ముట్టుకు షాక్కొడుతుందంటారు
మరి గౌరవ ఎమ్మెల్యే పవిత్ర రిగ్గింగ్ యజ్ఞం చేస్తోంటే
లాఠీలకు భయం సంకెళ్ళేసుకుని
పోలింగ్ బూత్ గుమ్మం దగ్గర బొమ్మలవుతారు
ఈ జడ్జీలు అక్షరాలు వెలిసిన బ్యాడ్జీలు
న్యాయం కోసం మా కాయం అంటారు
మరి ఓట్లు పడని అక్కసుతో
గౌరవ ఎంపీ ఇష్టదేవతల ప్రీత్యర్థం
గృహ దహనం చేశారని తెలిసీ
ఖాళీ సూట్ కేసులు కుడిచేత్తో
ఇండియన్ పీనల్ కోడ్‌లు ఎడమ చేత్తోనూ పట్టి
ఆయనింటి గోడమీద కాపలా బొమ్మలవుతారు
ఈ కవులు ఆడియో కట్ అయిన రేడియోలు
వాళ్ళెంత రాస్తే ఏం లాభం?
వాళ్ళ కాగితం తెలుపు; వాళ్ళ ఇంకూ తెలుపే
వీళ్ళు రాసేది వీళ్ళ దగ్గరే మాయమవుతుంది
వీళ్ళంతా సమాజం గుమ్మమ్ముందు
చవుకబారు కాగితం బొమ్మలవుతారు

